న్యూ ఇయర్ వేడుకలకు ఏర్పాట్లు

- ట్యాంక్‌బండ్, స్టీల్ బ్రిడ్జిపై పోలీసుల ఆంక్షలు
- నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు

రాంనగర్/కవాడిగూడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు భారీగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, అపార్ట్‌మెంట్‌లోని సభ్యులతో కలిసి సామూహికంగా నూతన సంవత్సరానికి స్వాగతం చెప్పేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అదేవిధంగా కాలనీ అసోసియేషన్లు, బస్తీ సంఘాలు కూడా తమ ప్రాంతాల్లో అందరితో కలిసి వేడుకలు నిర్వహించుకునేందుకు స్టేజీలు, డీజేలు ఏర్పాటు చేసి కేక్ కటింగ్‌లు ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి ఒక్కరూ న్యూ ఇయర్ కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకోవడం ఆనావాయితీగా వస్తుంది. అయితే కేకలు తయారు చేసే బేకరీలయాజామాన్యాలు వివిధరకాల కేక్‌లను తయారు చేయడంలో నిమగ్నమయ్యాయి. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని పిస్తాహౌజ్‌తో పాటు పలు పేరొందిన బేకరీలు ఆఫర్లు పెట్టాయి.



నూతన సంవత్సర వేడుకలు అంటేనే మద్యం పార్టీలు జోరుగా ఉంటాయి. ఇందుకోసం 31వ తేదీన రాత్రి మద్యం అమ్మకాలు జోరుగా ఉంటాయి. షాపుల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తకుండా క్యూలైన్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ప్రత్యేక ఆఫర్లుగా కూడా కొన్ని కంపెనీలు ప్రకటించినట్లు షాపు యాజమానులు తెలియజేశారు.

ముస్తాబైన ఆలయాలు

నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1వ తేదీన చాలామంది దైవదర్శనం చేసుకోవడం జరుగుతుంది. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ రెండు నియోజకవర్గాల్లోని ఆలయాల నిర్వాహకులు కావాల్సిన ఏర్పాట్లు చేశారు. చిక్కడపల్లి వెంకటేశ్వరస్వామి దేవాలయం, లిబర్టీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, డీడీ కాలనీలోని సాయిబాబా ఆలయం, బిర్లాటెంపుల్, కట్టమైసమ్మ దేవాలయం, అంబర్‌పేట మహంకాళిఆలయం, రాంనగర్ రామాలయం, అడిక్‌మెట్ వీరంజానేయస్వామి ఆలయాలు ప్రత్యేక పూజలకు ముస్తాబు అయ్యాయి.

ఫ్లైఓవర్లపై రాకపోకలు బంద్



నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిసెంబర్ 31వ తేదీన రాత్రి పది గంటలకు ట్యాంక్‌బండ్‌ను, తెలుగుతల్లి ఫ్లైఓవర్, నాయిని నర్సింహారెడ్డి స్టీల్ బ్రిడ్జిలపై రాకపోకలు నిలిపివేస్తాం. బ్రిడ్జిలపైకి ఎవరూ వెళ్ల కుండా పోలీసులు పికెట్ నిర్వహిస్తారు. ఎవరైనా న్యూ సెన్స్ చేస్తే కేసులు నమోదుచేస్తాం.

-శ్రీనివాస్‌రెడ్డి, దోమలగూడ సీఐ

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తాం.



డిసెంబరు 31 రాత్రి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేస్తాం. మద్యం తాగి ఎవరూ రోడ్లపైకి రావద్దు. రోడ్లపైకి వచ్చి సమస్యలను కొనితెచ్చుకోవద్దు. ట్రాఫిక్ నిబంధనలు ఎవరూ ఉల్లంగించినా వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం.

-వీరేశం, చిక్కడపల్లి ట్రాఫిక్ సీఐ

ఆంక్షలు ఉల్లంఘిస్తే కేసులు



నూతన సంవత్సరం సందర్భంగా పోలీసుల ఆంక్షలను ఎవరు ఉల్లంఘించినా చట్ట పరంగా కేసులు నమోదు చేస్తాం. ప్రధాన చౌరస్తాల్లో పోలీసు పికెట్లు, పెట్రోలింగ్ ఏర్పాటు చేస్తున్నాం. వైన్‌షాపుల యజమానులు, బార్ అండ్ రెస్టారెంట్లు, బిర్యానీ హోటళ్ల పోలీసు నిబంధనలు పాటించాలి. ఉల్లంఘిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తాం.

- రాంబాబు, ముషీరాబాద్ సీఐ



ఉచిత కుట్టుమిషన్ శిక్షణాకేంద్రాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

చిక్కడపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేదమహిళలు ఆర్థికంగా బలోపేతం కావడానికి వారికి ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణాకేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గాంధీనగర్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ వివరించారు. డివిజన్‌లోని మహిళల స్వయం ఉపాధికి లయన్స్‌క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ ప్యారడైజ్, నీవీ చారిటబుల్‌ట్రస్ట్ సంయుక్తంగా చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ ఆవరణలోని మహిళాభవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుశిక్షణ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఈ కేంద్రంలో మహిళలకు కుట్టు, మగ్గం వర్క్‌లపై శిక్షణ కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాలి

- అధికారులకు కాంగ్రెస్ నేత ప్రవీణ్ వినతి



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రవీణ్, తదితరులు

కవాడిగూడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం కవాడిగూడ డివిజన్‌లోని వైస్రాయ్ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జీహెచ్ఎంసీ కమిషనర్ డాక్టర్ ఇలామ్ బర్తీ, ట్రాఫిక్ కమిషనర్ విశ్వప్రసాద్‌లకు వినతి పత్రం అందజేసినట్లు నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆకుల ప్రవీణ్ తెలిపారు. సోమవారం కలెక్టర్, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ కమిషనర్ కార్యాలయాల్లో వారిని కలిసి ప్రవీణ్ వినతి పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం అనుమతి కోసమే వివిధ శాఖల అధికారులను కలిసినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంలో రాజకీయాలకతీతంగా అన్ని పార్టీల నేతలు , ప్రభుత్వం, అధికారులు సహకరించాలని ఆయన కోరారు.

నూతన సంవత్సరానికి వేంకటేశ్వరాలయంలో ఏర్పాట్లు

చిక్కడపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతన సంవత్సరం సందర్భంగా ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆలయంలోపలికి భక్తులు వెళ్లడానికి క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయంలో స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపక వంశీయుడు రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు శ్రీనాథ్ గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు.



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లక్ష్మణ్ గుప్తా

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం

చిక్కడపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్ డివిజన్ తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం వద్ద అమావాస్య సందర్భంగా పేదలకు అన్నదానం నిర్వహించారు. వైశ్యసంఘం సభ్యులు ప్రొద్దుటూరు నరసింహారావు, నాగరాజు సహకారంతో నిర్వహించిన కార్యక్రమాన్ని సంఘం అధ్యక్షుడు చేపూరి లక్ష్మణ్ గుప్తా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత పాల్గొనాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పల్లెర్ల రమేష్, శ్రీనాథ్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తాలో నిరసన చేస్తున్న సీపీఎం నేతలు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం నిరసన

గోల్నాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ సాక్షిగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో సోమవారం శ్రీరమణ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ పార్టీ నాయకులు ప్లకార్డులను చేతబూని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మహేందర్ మాట్లాడుతూ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవహేళన చేస్తూ చులకన భావంతో గేలిచేస్తూ పార్లమెంట్ సాక్షిగా అవమానపరచడాన్ని సీపీఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హోంమంత్రి వెంటనే భారత ప్రజానీకానికి క్షమాపణ చెప్పాలంటూ ఆయన డిమాండ్ చేశారు. బీజేపీ నాయకత్వం వెంటనే అమిత్‌షాను కేంద్రమంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి పార్టీ నుంచి కూడా తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ అంబర్‌పేట జోన్ కమిటీ సభ్యులు రాములు, సుబ్బారావు, షబానా, వరలక్ష్మి, సోమయ్య, నాయకులు శ్రీనివాస్, సతీష్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్, హైదరాబాద్ సిటీ-1 పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు నాగేశ్వరరావు, వినోద్‌కుమార్ తెలిపారు. జవహర్‌నగర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, నారాయణగూడ పరిధిలో 10 నుంచి 1.30 వరకు, చిక్కడపల్లి పరిధిలో 11.30 నుంచి 1.30 వరకు, గాంధీకుటీర్, జగదాంబనర్సింగ్ హోమ్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు, కేశవ్‌మెమోరియల్ పరధిలో 3.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

ఆర్మీ జవాన్ పర్సు చోరీ

బర్కత్‌పుర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ జవాన్ పర్సును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... అనకాపల్లికి చెందిన నాగేశ్వరరావు ఇండియన్ ఆర్మీలో జవాన్‌గా పనిచేస్తున్నాడు. జమ్మూ నుంచి నగరానికి రావడానికి జమ్మూతావి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కుతుండగా దొంగలు పర్సును తస్కరించారు. ఢిల్లీ మీదుగా కాచిగూడకు వచ్చిన నాగేశ్వరరావు రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పర్సులో పాన్, బ్యాంకు, క్రెడిట్ కార్డు, లీవ్ సర్టిఫికెట్, 2,500 నగదు, ఆర్మీ క్యాంటీన్, ఆధార్ కార్డులు ఉన్నాయని తెలిపారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం జమ్మూరైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ ఎల్లప్ప తెలిపారు.

మహిళ బ్యాగును తస్కరించిన దొంగలు

నగరానికి చెందిన రాజకుమారి తిరుమలై-కాచిగూడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలులో వస్తుండగా ఆమె బ్యాగును దొంగలు తస్కరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... పిడుగురాళ్ల వద్ద రాజకుమారి బ్యాగు చూడగా కనిపించలేదు. దానిలో రెండు సెల్ ఫోన్లు, 50 గ్రాముల వెండి ఆభరణాలు, 2 వేల రూపాయల నగదు ఉందని కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ కోసం నడికుడి రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

- క్రిమిలేయర్‌ను తొలగించాలి : ఎంపీ ఆర్.కృష్ణయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

రాంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల ఉద్యమానికి బీసీ ఉద్యోగులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. సోమవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలు కులాల పేరు మీద విడిపోవడంతో న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నామని అన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, న్యాయ, రాజ్యాంగ పరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమి లేవని అన్నారు. మండల్ కమిషన్ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఇటీవల సుప్రీం కోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం బీసీ ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు ఇచ్చిందన్నారు. అన్ని వైపుల నుంచి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులు ఉన్నాయని, ఈ రిజర్వేషన్లు పెట్టడానికి ఎలాంటి అవరోధాలు లేవని ఆయన పేర్కొన్నారు. జనవరి 11వ తేదీన 19వ ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ నాయకులు నీల వెంకటేష్, నంద గోపాల్, వేముల రామకృష్ణ, రఘుపతి, కె.సతీష్, శేషుకుమార్, సర్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు పోరాడాలి: ఎస్‌ఎఫ్‌ఐ



సుందరయ్యవిజ్ఞాన కేంద్రం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆవిర్భావ వేడుకల్లో పతాకాన్ని ఎగురవేసిన నేతలు

రాంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యలే లక్ష్యంగా ఎన్నో విజయాలు సాధిస్తూ పోరాటాలను కొనసాగిస్తూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్‌ఎఫ్‌ఐ అవతరించిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎల్.మూర్తి అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ 55వ ఆవిర్భావ వేడుకలు హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఎస్‌ఎఫ్‌ఐ విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ ముందుకెళ్తుందన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి అమరవీరులను స్మరించుకుంటూ రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు కోట రమేష్, ఎండీ జావేద్, లెనిన్, స్టాలిన్, శ్రీమన్, నాగేందర్, ప్రశాంత్, విగ్నేష్, రాజేష్, రజనీకాంత్, సహనా తదితరులు పాల్గొన్నారు.



బేడ, బుడగ, జంగాల సదస్సులో అభివాదం చేస్తున్న సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం, జాతీయ అధ్యక్షుడు నర్సింహ

ఎస్సీ వర్గీకరణలో బేడ బుడగ జంగాలకు సముచిత స్థానం కల్పించాలి: మన్నెం

రాంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో బేడ, బుడగ, జంగాలకు సముచిత స్థానం కల్పించాలని, ఎస్సీ ఉపకులాలకు 20 వేల కోట్లతో ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బేడ బుడగ జంగాలను చైర్మన్‌గా నియమించాలని బేడ, బుడగ, జంగాల హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు సిరిగిరి మన్నెం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బేడ, బుడగ, జంగాల హక్కుల సంఘం 23వ ఆవిర్భావ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడచిన బేడ బుడగల అభివృద్ధి, సంక్షేమం జరగలేదని వాపోయారు. బేడ బుడగ జంగాలకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తమకు రావాల్సిన వాటా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు నర్సింహ, కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు అంజనప్ప, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వీరప్ప, నాయకులు శ్రీనివాసులు, మంతప్ప, చిన్నకోటయ్య, సహదేవుడు, మల్లికార్జున్, రమేష్, వెంకటేష్, రాజు, రాంగోపాల్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో దేశ సేవ చేస్తాం

- ఎన్‌సీసీ విద్యార్థిని శాల్మలి కడెం



రాంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశభక్తి, పట్టుదలతో క్రమశిక్షణ ద్వారా సేవ చేయడమే తన ఏకైక లక్ష్యమని ఎన్‌సీసీ (నేవీవింగ్) విద్యార్థినీ శాల్మలి కడెం అన్నారు. ఉత్తమ కేడెట్‌గా ఎంపికై 2025 జనవరి 26న జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. రైఫిల్ షూటింగ్, కూచిపూడి నాట్యంలోనూ శాల్మలి ప్రవీణురాలు. న్యూఢిల్లీలో తనకు గురువులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ స్థాయికి ఎదిగానని శాల్మలి తెలిపారు.



అమావాస్యను పురస్కరించుకుని కందూరి కృష్ణ ఫౌండేషన్, సేఠ్ మాణిక్‌లాల్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం చిక్కడపల్లిలో పేదలకు అల్పాహారం పంపిణీ చేశారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



ట్రస్మా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన సాదుల మధుసూదన్, రమేష్‌రావు

ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా సాదుల మధుసూదన్

- ప్రధాన కార్యదర్శిగా రమేష్‌రావు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడిగా అంబర్‌పేట ప్రగతివిద్యానికేతన్ హైస్కూల్ చైర్మన్ సాదుల మధుసూదన్ భారీ మెజార్టీతో ఎన్నికయ్యారు. మధుసూదన్‌కు 2220 ఓట్లు పోల్ కాగా ఆయన సమీప అభ్యర్థి ప్రకాష్ బాబుకు 91 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్రా నారాయణరెడ్డి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ఎస్.రమేష్‌రావు, కోశాధికారిగా పి.రాఘవేంద్రరెడ్డి గెలుపొందారు. ఎన్నికల్లో గెలుపొందిన వారికి ఎన్నిక ధ్రువీకరణ పత్రాలు అందచేశారు. అనంతరం గెలుపొందిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శితో ప్రమాణ స్వీకారం చేయించారు.



మాధవన్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న హనుమంతరావు

పీపీ మాధవన్ కుటుంబానికి వీహెచ్ పరామర్శ

బర్కత్ పుర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధినేత సోనియాగాంధీ పర్సనల్ కార్యదర్శి పీపీ మాధవన్ ఈనెల 16న మరణించిన విషయం విధితమే. మాజీ ఎంపీ హనుమంతరావు సోమవారం కేరళ రాష్ట్రంలోని త్రిసూర్ జిల్లాలోని పిపి మాధవన్ నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. భార్య అతని కుమారుడు దీపక్, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వీహెచ్ మాట్లాడుతూ సోనియా గాంధీకి ముందు పీపీ మాధవన్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి కూడా పర్సనల్ కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 40 ఏళ్లగా సోనియాగాంధీ కుటుంబానికి సేవలు అందించారని ఆయన సేవలు ఎప్పటికీ మరువలేనివన్నారు. పీపీ మాధవన్‌తో స్నేహబంధం ఉందని మంచి స్నేహితుడిని కోల్పోయానన్నారు.

దయానంద్‌యాదవ్‌కు ఉద్యోగపతి అవార్డు

బర్కత్‌పుర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సిటిజెన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాపారవేత్త రతన్‌టాటా 86వ జయంతి సందర్భంగా ప్రముఖ పారిశ్రామికవేత్త బండారి దయానంద్‌యాదవ్‌కు ఉద్యోగపతి అవార్డు-2024 ప్రదానం చేశారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ పురుషోత్తమ్ పాల్గొని శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుసూదనాచారి, పక్కన జనార్దనమూర్తి

రచనలతో ఆదర్శంగా నిలిచిన సీఆర్

చిక్కడపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీఆర్‌గా ప్రఖ్యాతిగాంచిన కట్టమంచి రామలింగారెడ్డి సాహిత్య విద్యారంగాల్లో ప్రజ్ఞాశాలి అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బహుముఖప్రజ్ఞాశాలి కట్టమంచి రామలింగారెడ్డి యాదిలో కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. మదుసూదనాచారి మాట్లాడుతూ కవిగా కట్టమంచి వారిది విశిష్టమైన శైలి అని 19 ఏళ్ల వయస్సులోనే ఖండకావ్యం, ముసలమ్మ , మనం రచించి నాటి సాహితీవేత్తల మన్ననలు అందుకున్నారని అన్నారు. తన రచనల ద్వారా అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచారన్నారు. 1926లో స్థాపించిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తొలి వీసీగా నియమితులై వర్సిటీకి మంచిపేరు సంపాదించి పెట్టారన్నారు. సాహితీవేత్త రఘుశ్రీ, బండారుపల్లి రామచంద్రరావు, గానసభ ఉపాధ్యక్షుడు కళాసుబ్బారావు మేధ తదితరులు పాల్గొన్నారు.



బాపూజీనగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న యూసీడీ వసంత

ముషీరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే

ముషీరాబాద్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో సొంత ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను సేకరించేందుకు యూసీడీ, రెవెన్యూ అధికారులు సోమవారం ముషీరాబాద్‌లోని బాపూజీనగర్‌లో సర్వే చేశారు. దరఖాస్తు దారుల ఇంటికి వెళ్లి వారి ఆర్థిక పరిస్థితులు, సొంత ఇళ్లా కాదా తదితర వివరాలను సేకరించి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. యూసీడీ అధికారి వసంత మాట్లాడుతూ ఇప్పటివరకు 900ల దరఖాస్తులను పరిశీలించామని తెలిపారు. అర్హులైన వారి వివరాలను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఎగ్బాల్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీతేజను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

మిస్ సౌత్ ఇండియా విజేత శ్రీతేజకు అభినందనల వెల్లువ

ముషీరాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబంలో పుట్టినా తన కళను నెరవేర్చుకునేందుకు విద్యార్థిని చదువుకుంటే మిస్ సౌత్ ఇండియా పోటీలో విజయం సాధించింది. ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన జ్యోతి, విజయ్ కుమార్‌ల కూతురు వి. శ్రీతేజ నాంపల్లిలోని ఇందిరాప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. తల్లిదండ్రులు చిన్న చిన్న పనులు చేస్తూ జీవనోపాధి పొందుతూ తన కూతుర్ని బాగా చదివించడంతోపాటు సమాజంలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా ప్రోత్సహిస్తూ పెంచారు. ఆమె తల్లి జ్యోతి ల్యాబ్‌టెక్నీషియన్‌గా ఓ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తుండగా తండ్రి విజయ్ కుమార్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తున్నాడు. శ్రీతేజ చదువులో రాణించడంతోపాటు ఈ నెల 21న ఢిల్లీలో మిస్ సౌత్ ఇండియా పోటీలు జరుగగా అందులో పాల్గొన్న శ్రీతేజ తన ప్రతిభను కనబర్చి మిస్ సౌత్ ఇండియా 2024 ప్రైడ్ టైటిల్‌ను గెలుచుకున్నారు. సోమవారం ముషీరాబాద్‌లోని తన ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, కాలనీ వాసులు, వివిధ పార్టీల నేతలు ఆమెను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ గంగపుత్రకాలనీలోని శ్రీతేజ ఇంటికి వెళ్లి అభినందించి ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మిస్ యూనివర్స్ పోటీలలో విజయం సాధించాలని ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పూసగోరక్‌నాథ్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, బీఆర్ఎస్ ముషీరాబాద్ మీడియా సెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ నాయకులు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తాగుబోతుల తెలంగాణగా మార్చొద్దు

- టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకులే వ్యాపారులైతే ప్రజల సంక్షేమం గాలిలో దీపమవుతుందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. ఈ నెల 31వ తేదీన రానున్న ఆంగ్ల నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్రంలో పెద్దఎత్తున మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వమే టార్గెట్ పెట్టి విక్రయించాలని పేర్కొనడం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యాపార దోరణికి నిదర్శనమన్నారు. మద్యం అమ్మకాల 33 వేల కోట్లకు పైగా టార్గెట్లను ప్రభుత్వం నియమించిందని విమర్శించారు. సోమవారం దోమలగూడలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలను ప్రోత్సహించడాన్ని మహిళా, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఏకమై ముక్తకంఠంతో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం ఎన్టీఆర్ చిత్ర పటాలతో కూడిన నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.